# మధుర భావన-16

తల్లిని తీసుకుని శ్యామసుందరి ఉంటున్న హాస్పటల్ కి వెళ్ళింది సుమజ.

అదే, హాస్పిటలూ, ఇల్లూ కాబట్టి... ఇద్దరూ ఆవిడ ఉంటున్న గదిలోకి వెళ్ళారు. ఎప్పటిలానే ఆవిడ భార్గవిని గుర్తుపట్టి... పక్కనే వున్న సుమజను గుర్తించనట్లే ''మీ అమ్మాయిని తీసుకురాలేదా, ఒక్కరే వచ్చారా?'' అనడిగింది.

భార్గవి నిరసనగా చూసింది.

సుమజ వైపు చూసి భార్గవి ''ఈమె కింకా తగ్గినట్లు లేదు...'' అంటూ ఆవిడతో ముక్తసరిగా చెప్పింది. ''నేను కూడా ఇక రాలేనండీ, సరే, ఈసారి వచ్చానుగా, మిమ్మల్ని చూసి చెప్పిపోదామని వచ్చా...!''

శ్యామ సుందరికి ఆవిడ ముభావానికి కారణం తెలియక ఆశ్చర్యంగా చూసింది.

సుమజ తల్లివైపు కొంచెం నిష్టూరంగా చూసింది. ''ఏమిటమ్మా... మానసిక ఆరోగ్యం సరిగాలేని ఆమెతో ఎందుకంత నిష్ఠూరంగా మాట్లాడటం...? " మెల్లగా అంది సుమజ తల్లితో.

''నేను నిజమే చెప్పాను... మనం మళ్ళీ ఇక ఎందుకు వస్తాం...? బాగా లేకపోతే మాత్రం కొన్ని బాగానే తెలుస్తున్నాయిగా!''

సుమజ చురుగ్గా చూసింది. ''నిజం ఏమిటి...? వంశీ పెళ్ళికి పిలిస్తే రామా...?''

భార్గవి ''ఏమిటీ...?'' అంటూ కూతురివైపు కఠినంగా చూసింది. ''ఆ... తిలోత్తమతో అతనికి పెళ్ళి జరుగుతూంటే...? మనం... చూడటానికి రావాలా... సిగ్గులేదా మనకి...?

సుమజ నిట్టూర్చింది. ''అమ్మా నేను చెప్పిన విషయాలకు నీకు బాగా కోపం వచ్చినట్లుంది! వంశీ పై అంత కోపం తెచ్చుకోవాల్సిన పనిలేదు. అతనికి ఇష్టమైన అమ్మాయితో అతని పెళ్ళి జరగటాన్ని మనం అంగీకరించగలగాలి!''

భార్గవి ''నువ్వు ఎన్ని చెప్పినా, నాకతనిపై ఏర్పడిన కోపం పోదు! అంత చపలచిత్తమా...? అసలు అతనే వెతుక్కుంటూ మనింటికి వచ్చాడు... నువ్వంటే ఇష్టమని చెప్పి... పెళ్ళి ఆలోచన చేసినవాడు... మరొక అమ్మాయితో పెళ్ళికి సిద్ధపడటాన్ని ఏమంటారు...? మనమేమీ అతన్ని పెళ్ళికి అంగీకరించమని అడగలేదూ... నిర్బంధపెట్టనూ లేదుగా...?'' అంటూ కూతురివైపు తీవ్రంగా చూసింది.

ఆశ్చర్యంగా చూస్తున్న శ్యామసుందరిని సుమజ గమనించింది. అందుకే... తల్లితో ''అమ్మా... ఈ మాటలు, వాదనలు అన్నీ ఇక్కడెందుకూ, ఇంటికి వెళ్ళాక మాట్లాడుకోవచ్చులే...'' అంటూ సుమజ లేచి నిలబడింది.

''సరే, పదా...'' అంటూ భార్గవి శ్యామసుందరివైపు 'బయలుదేరుతున్నాం' అన్నట్లుగా ఓ చూపు చూసి సుమజతో అక్కడనుండి చకాచకా అడుగులు వేస్తూ బయలుదేరింది.

గేటు తలుపు తీసి బయటకు వెళ్ళబోతున్న వాళ్ళిద్దరి దగ్గరకు ఓ కుర్రాడు వచ్చి ''అమ్మా... మిమ్మల్ని డాక్టరు గారు రమ్మంటున్నారు...!'' అని చెప్పాడు.

డాక్టరుగారిని కలిసి శ్యామసుందరి ఆరోగ్యం గురించి ఏమీ వాకబు చేయకుండానే వెళ్ళిపోతున్నందుకు పిలిచి వుంటారనిపించింది వాళ్ళకి.

సుమజ తల్లి చేయి పట్టుకుని 'అమ్మా... వంశీ పెళ్ళి సంగతులేమీ నువ్వు డాక్టరుగారి దగ్గర ప్రస్తావించకు. మామూలుగానే చూసి వెళ్ళటానికి వచ్చాం కదా, అదే చెప్పు... అత్తయ్య ఎప్పటిలానే నిన్ను గుర్తు పట్టిందిగానీ పక్కనే వున్న నన్ను గుర్తించలేదు కాబట్టి.... ఆమె ఆరోగ్యం యథాప్రకారంగానే ఉందని అర్థమై, డాక్టరుగారిని కలిసి తెలుసుకునేదేమీ లేదనే ఉద్దేశ్యంతో వెళ్ళిపోతున్నామని చెబుదాం... సరేనా...?'' అంది సుమజ.

భార్గవి కొంచెం నిష్టూరంగా చూస్తూ అలాగే అన్నట్లు తలవూపింది.

ఇద్దరూ వెనుదిరిగారు.

* * *

వంశీకి సుమజ దగ్గర్నుండి ఫోను వచ్చింది. సుమజ చేస్తుందని అతను ఊహించకపోవటంతో ఆశ్చర్యపడ్డాడు. ''హలో...'' అంటూ పలుకరించి ''ఓ మాట చెప్పాలని చేసాను...'' అంది.

అతను నిర్లిప్తంగా ‘‘ఏమిటీ...?’’ అనడిగాడు.

‘‘మధురం... మధురం...

ఎంత మధురమీ భావన...

ఆ దేవదేవుని దీవన...

అంటూ నా మనసు ఆలపిస్తోంది... అని చెప్పాలని ఉదయం మీ ఇంటికి ఒక్కదాన్నే ముందుగా వచ్చాను...కానీ తిలోత్తమ చెప్పిన విషయాలకు నా మనసు మూగపోయింది.... ఎందుకు వంశీ...మీ నిర్ణయం మార్చుకున్నపుడు మీరే ఆ విషయం నాకు చెప్పాలిగానీ తనతో చెప్పించటం ఎందుకూ...అది నన్నింకా నొప్పిస్తుందని మీకు తెలియదా ’’ అంటూ ఫోను పెట్టేసే సరికి వంశీ చిన్నబోయాడు.

సుమజకు ఏమని జవాబు చెప్పాలో అతనికి అర్థం కాలేదు. మళ్ళీ చేసి అమ్మతో ప్రస్తావించాకనే తను ఆ విషయం సుమజకు చెబుదామనుకున్నాననీ, ఇంతలోనే తిలోత్తమ ఆ విషయం తనకి చెప్తుందని తను ఊహించలేదనీ చెబుదామనుకున్నాడు కానీ ఆ ప్రయత్నం విరమించి... దీర్ఘంగా నిట్టూర్చి మిన్నకుండిపోయాడు. కానీ ఇంక ఆలశ్యం చేయకుండా రేపే అమ్మతో తిలోత్తమ తో తన పెళ్ళి నిర్ణయం చెప్పేయాలని నిర్ణయించుకున్నాడు.

మంచం మీద పడుకున్నాడే కానీ అశాంతిగా తన నిర్ణయానికి తన మనసే ఎదురు తిరుగుతున్నట్టుగా అనిపిస్తుండగా...వంశీ గతంలోకి జారుకున్నాడు.

ఒకసారి సుమజతో మాట్లాడుతున్నప్పుడు తను అన్నాడు... " సాధారణంగా అమ్మాయిలు ఎక్కువ కబుర్లు చెప్తారు కదా..కానీ నువ్వు మాత్రం నా సంగతులు అన్నీ చెప్పిస్తావే గానీ నీవేమీ చెప్పవు” అలక నటిస్తూ. సుమజ హాయిగా నవ్వింది... “మీరు అడగండి..నా గురించి ఏం తెలుసుకోవాలనుకుంటున్నారో” అనగానే..." నాకూ నీ చిన్నప్పటి సంగతులు వినాలనుంది" అన్నాడు.

సుమజ హుషారుగా మొదలుపెట్టింది..." చిన్నప్పటినుంచీ నేను చాలా గారాబంగా పెరిగాను. అమ్మకి ఇద్దరు అక్కలు. ఇద్దరికీ అబ్బాయిలే...అమ్మాయిలు లేకపోవటం వల్లనేమో...పెద్దమ్మలూ...అలానే అన్నయ్యల దగ్గరా చాలా స్పెషల్ ట్రీట్మెంట్ ఉండేది. నానోటి నుండి ఏదన్నా కోరిక రావటం చాలు...అది తీర్చటానికి అందరూ పోటీ పడి మరీ ఆ కోరిక క్షణాల్లో తీర్చేసేవారు. నా ఫ్రెండ్స్ అందరూ ఏడిపిస్తూ

వుండేవాళ్ళు కూడా....ఇలా ఇంత గారాబంగా పెరిగితే నువ్వు..రేపు పెళ్ళయ్యాక మీ ఆయన పారిపోతాడు తల్లీ అని. ఎంత గారాబంగా పెరిగినా నేను చదువులో ఎప్పుడూ వెనకపడలేదు. ఒకసారి పరీక్షలో 100 కి 99 మార్కులు వచ్చాయి...ఆ ఒక్క మార్క్ పోయినందుకు నేను చాలా బాధ పడుతూ వుంటే...మా పెద్దమ్మ వాళ్ళ అబ్బాయి వచ్చాడు. " ఎందుకే ఫీల్ అవుతున్నావ్...మార్కులు తక్కువ వచ్చాయా " అన్నాడు. పెద్దమ్మ వెంటనే " సుమని చూసి నేర్చుకోరా....నువ్వూ వున్నావ్. 36 పాస్ మార్కులు వస్తే సంతోషిస్తున్నావ్...అదేమో 99 మార్కులు వచ్చినా ఆ ఒక్క మార్క్ గురించి తెగ బాధ పడుతుంది. " అంది. " అమ్మా...సుమ 100 మార్కులకి చదివి 99 తెచ్చుకుంది. నేనేమో 35 మార్కులకు చదివి ఒక మార్క్ ఎక్కువగా తెచ్చుకున్నా. ఎవరు గొప్ప అంటావ్ " అనటంతో పెద్దమ్మ తెల్లమొహం వేసింది.

ప్రతి వేసవి శెలవుల్లో పెద్దమ్మ పిల్లలతో ఆడుకుంటూ సరదాగా గడిపేసేవాళ్ళమా...వెళ్ళాల్సివచ్చినప్పుడు మాత్రం చాలా బాధగా ఉండేది. దానికి తోడు మా అన్నయ్యలు ఇంటి గేటుకి తాళం కూడా వేసేసి దాచేసేవాళ్ళు. సుమని ఇంకొన్ని రోజులు వుంచెయ్యమని అమ్మ ని ప్రాధేయపడుతూ వుండేవాళ్ళు. నాకూ అలానే వుండేది. ఇంట్లో అమ్మా, నాన్న ఎంత స్నేహితుల్లా వున్నా నాకూ అక్కో, అన్నయ్యో వుంటే ఎంత బాగుండేది అనుకుంటూ ఉండేదాన్ని. కానీ నేను పుట్టాక అమ్మకి ఏదో అనారోగ్య సమస్య రావడంతో ఇంకొకళ్ళు వద్దనుకున్నారట ! అమ్మాయైనా...అబ్బాయైనా అన్నీ నేనే అనుకుని పెంచారు అమ్మా, నాన్నా"... అని చెబుతూ...'బోర్ కొడుతున్నానా' అని ఆగింది సుమ.

చిత్రం ఏమిటంటే...సుమ ఎంత సేపు మాట్లాడినాతనివి తీరదు తనకి. తను పరిచయమైన కొత్తల్లో ఇద్దరూ చాలా కబుర్లు చెప్పుకుంటూ వుండేవారు కానీ స్నేహపు పరిధుల్లోనే తమ కబుర్లు ఉండేవి...ఎందుకో ఒకసారి తనని చూడాలని బాగా అనిపించింది. వాళ్ళ ఇంటి అడ్రసు తెలుసుకానీ వెళ్ళాలంటే మొహమాటం. 'బయట ఎక్కడైనా కలుద్దామా' అని అడుగుదామనుకున్నాడు. రెండు రోజులు ప్రయత్నించినా...అడగలేకపోయాడు. తను ఏమనుకుంటుందో అనే ఆలోచన వల్ల. చివరికి ఒకరోజు .." సుమా, నీతో కలిసి కాఫీ తాగాలని వుంది, నీ కబుర్లు వింటూ...రేపు మా ఆఫీసు దగ్గర వుండే కాఫీ షాప్ కి సాయంత్రం 4 గంటలకు రాగలవా ?" అని అడిగేసాడు. అటు వైపు నుంచి కొంతసేపు మౌనం. ఆ రెండు నిమిషాలు నా గుండె చప్పుడు తనకే భయం కలిగించేలా వినిపించింది. తను సన్నగా నవ్వి...'చూద్దాం నాకూ వీలైతే' అని ఫోన్ పెట్టేసింది.

ఇక ఆ రాత్రంతా కలత నిద్రే. ఎప్పుడు తెల్లారుతుందా...సాయంత్రం తనతో ఏం మాట్లాడాలా అని రకరకాల రిహార్సల్స్...తనకే నవ్వు వస్తుంది. ఏదో టీనేజ్ లో వున్న పిల్లాడిలా ఏమిటీ ఈ కంగారు అని. సాయత్రం 4 దాకా ముళ్ళ మీద వున్నట్టే ఆఫీసులో అన్యమనస్కంగానే గడిపి..4 అవటానికి ఇంకా 10 నిమిషాలు వుండగానే కార్ తీసుకుని కాఫీ షాప్ ముందు వాలిపోయాడు. మునుపు ఎవరైనా ఇలా ఆఫీసు టైం లో షికార్లు చేస్తే విసుక్కునే తను ఈ రోజు ఇలా...మనసులోనే నవ్వుకున్నాడు. ఎవరికైనా...తన దాకా వస్తే గానీ అర్థం కాదన్నమాట. నాలుగు అవుతూంటే..ఒకటే కంగారు. నిజంగా వస్తుందా...వస్తే ఒక కంగారు...రాకపోతే ఎందుకు రాలేదో అనే కంగారు. మొత్తానికి ఏదైనా కంగారు తప్పదన్నమాట అనుకున్నాడు. ఫోన్ మోగింది. గుండె ఝల్లుమంది. వెంటనే ఆలోచనలనుండి బయట పడి ఆత్రుతగా ఫోన్ ఎత్తాడు.  ఎవరో రాంగ్ నెంబర్. విసుగ్గా కట్ చేసాడు. ఇంకో పది నిమిషాలు పది యుగాల్లా గడిచాయి. ఫోన్ రింగ్ తో ఉలిక్కిపడి ఫోన్ అందుకున్నాడు. ఎవరో కార్ లోన్ కావాలా అని చాలా తియ్యగా అడుగుతున్నారు. మన వెంటపడి డబ్బులు అప్పు ఇవ్వటమేమిటో తనకి అర్థంకాదు. వీరబ్రహ్మం గారు చెప్పిన కలికాలం ఇదేనేమో అనుకున్నాడు. ఇంకో ఫ్రెండ్ కాల్ చేసాడు. కట్ చెయ్యలేకా ...మాట్లాడలేకా తన అవస్థ చూడాలి. మొత్తానికి ఆఫీసులో బిజీ గా వున్నానని చెప్పి పెట్టేసాడు. తీరా సుమ ఫోన్ చేసినప్పుడు తన ఫోన్ బిజీ రాకూడదు కదా అని. ఇంతలో అయిదు అయ్యింది. ఇక తను రాదు అని అర్థమయ్యింది. నిరాశగా పక్కనే వున్న పెట్రోల్ బంక్ లోకి వెళ్ళాడు. ధ్యాస అంతా ఫోన్ మీదే వుంది. ఇలా బయటకు వచ్చి వెనక్కి వెళ్తోంటే ....మళ్ళీ మోగింది ఫోన్. ఈసారి నిరాసక్తంగా ఎత్తాడు. ' హలో కరణ్ గారూ...ఎక్కడ వున్నారు ?' అని తియ్యగా తన స్వరం. ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు... 'కరణ్ అంటుందేమిటీ ?' అని.

'సుమా....మీరు..నువ్వు...కరణ్ ఎవరు ?' అంటూ తడబడ్డాడు.

"అంటే మీరు 'కాఫీ విత్ కరణ్' ప్రోగ్రాంలా పిలిచారు కదా కాఫీకి...అందుకే కరణ్ అని పిలిచా. నేను అసలు కాఫీ తాగుతానో లేదో కూడా తెలుసుకోకుండా పిలిచేసారు. సరే కదా అని వస్తే మీరు ఇక్కడ లేనే లేరుగా"...అల్లరిగా నవ్వింది సుమ.

వంశీ బిత్తరపోయాడు. తన కోసం అక్కడ వెయిట్ చేయకుండా పెట్రోల్ కోసం వచ్చినందుకు తనని తనే తిట్టుకున్నాడు. "అయ్యో...ఎంతసేపైంది నువ్వు వచ్చి. రానన్నావ్ కదా అని ఎదురు చూసి చూసి ఇప్పుడే నిజంగా ఇప్పుడే బయటకి వచ్చా"...అంటూ కంగారు కంగారుగా వంశీ చెబుతుంటే సుమజ కిల కిలా నవ్వింది.

“భలే..నమ్మేసారా...నేను రానేలేదండీ...తమాషాగా అన్నానంతే...ఏమనుకోవద్దు వంశీ..మీరంటే ఎంత ఇష్టం వున్నా నేను కొన్ని హద్దులు దాటలేను. నిజానికి అమ్మా, నాన్నా ఇలాంటి హద్దులు విధిస్తే మనం వింటామో లేదో తెలియదు...వాళ్ళు నాకు ఎంత స్వేచ్చ ఇచ్చారంటే...నా అంతట నేనే వాళ్ళ నమ్మకాన్ని పోగొట్టకుండా నా హద్దుల్లో నేను వుండటం అలవాటు అయిపోయింది. కానీ మీ విషయంలోనే మనసు అదుపు తప్పుతోంది. మీరేం మాయ చేసారో కానీ” ...మధురంగా వుంది తన నవ్వు.

వంశీకి ప్రపంచం అక్కడే ఆగిపోయిన ఫీలింగ్. “అవునా...ఎంత అదృష్టవంతుడిని నేను....మొదటిసారి ఈ లోకాన్ని జయించిన ఫీల్, నచ్చిన అమ్మాయి మెచ్చుకుంటుంటే ఇలా వుంటుందన్నమాట...’కవిని అయినా కాకపోతిని...ఈ మధురానుభూతిని వర్ణించగా..’ వంశీ రాగంతీయగానే సుమజ.." అబ్బో...రాదు రాదు అంటూనే కవిత్వం ఒలకబోస్తున్నారుగా" అంటు నవ్వింది.

" మీతో మాట్లాడుతుంటే...అలా మీరు చెప్పే కబుర్లు వినాలనుంటుంది తెలుసా....నేనెలా కాబోయే వాడి గురించి వూహించుకున్నానో మీరు అచ్చం అలానే ప్రేమగా, ఆడవాళ్ళంటే ఎంతో మర్యాదగా ..నవ్వుతూ నవ్విస్తూ...జీవితాన్ని ప్రతీ నిమిషం సరదాగా గడపాలనుకునే వ్యక్తి లానే ఉండటం నాకెంతో సంతోషంగా అనిపిస్తుంది ఎప్పుడూ. మీతో వుంటే, జీవితాంతం నవ్వుతూ...తృళ్ళుతూ గడిపెయ్యగలననే భరోసా కలిగింది. మా నాన్న ఎప్పుడూ దిగులుగా ఉండేవాళ్ళు...తను ఎంత ప్రేమగా నన్ను పెంచారో, నన్ను చేసుకోబోయే వాడు నన్ను అలా చూసుకుంటారో లేదో అని. నేనూ అలానే అమ్మా నాన్నల్లా ఎవరూ నన్ను చూసుకోలేరు అనే నమ్మకంతోనే వుండేదాన్ని. కానీ మీ రాకతో నా అభిప్రాయాలు మారిపోయాయి..." అని ఆపేసింది సిగ్గుతో.

అలా తన ఆలోచనల్లో ...మధురానుభూతిలో వుండగానే తెల్లారినట్టుంది......ఫోన్ గణ గణ మని మోగుతుంటే లేచాడు. తిలోత్తమ ఫోన్ ఎత్తి ‘నిజమా...సరే, ఎప్పుడూ..ఎక్కడా’ అని ఆశ్చర్యపోతుంటే.....’ఎవరు తిలోత్తమా’ అని అడిగాడు వంశీ.

“ సుమజ అమ్మగారు బావా...ఇది విన్నావా, సుమజ పెళ్ళి నిశ్చయమైందంట ! ఎవరో కృష్ణ మోహన్ అంట. వచ్చే వారమే పెళ్ళి అని చెప్పారు. నువ్వేమో ఎప్పటినుంచో నేను నీ వెంట పడుతుంటే....ఇప్పటికి ఆంటీ కి చెబుతానన్నావ్...సుమ చూసావా...ఎంత ఫాస్ట్ గా వుందో...." అని ఇంకా ఏదో చెబుతుంది కానీ వంశీ కి ఏమీ వినబడట్లేదు...నిద్ర మత్తంతా ఎగిరిపోయింది. ప్రపంచం గిర్రున తిరుగుతున్నట్లైంది.